# మల్లెతీగ

ఆ రోజు ఆదివారం. ఆఫీసుకి సెలవు కావటంవల్ల భోజనం చేసి తీరిగ్గా పడుకున్న వాడిని చటుక్కున ఎవరో పిలిచినట్లు అనిపించి కళ్ళు తెరిచాను.

ఎవరూ లేరు. కానీ దొడ్లో నుంచి పాత్రలు తోముతున్న చప్పుడు, పైపునుంచి నీళ్ళు పడుతున్న చప్పుడు వినిపిస్తున్నాయి. దాంతోపాటు జానకి గొంతు వినబడుతున్నది.

"సరే వెళ్ళు నాయనా....నేను నాన్నకు చెబుతానులే" అంటున్నది జానకి.

"మా అమ్మ మంచిది...థాంక్యూ మమ్మీ" అంటున్నాడు వాసు.

అంటే పుత్రరత్నం కోరిన కోరిక ఏదో తీర్చిందన్నమాట. అందుకే వాడు కృతజ్ఞతలు వాళ్ళమ్మతో చెప్పుకుంటున్నాడు. మరి నాకు ఎదురుపడే ధైర్యం వాడికి వుంటేగా...నా అంతట నేనే కలుగచేసుకుని చెప్పినా వింటాడా..వాడినని ప్రయోజనం లేదు. వాళ్ళమ్మ వాడినలా తయారు చేసింది.

ఆ రోజు నాకింకా జ్ఞాపకం.

నేను ఆఫీసు నుంచి వస్తూనే జోళ్ళయినా విడవకుండా సోఫాలో చేరగిలబడ్డాను.

"కాసిని మంచినీళ్ళు పట్టుకురారా వాసూ" అన్నాను కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ.

"నూట మూడు, నూట నాలుగు..ఐదు.." అంటూ సిగరెట్టు పెట్టెలు లెక్కపెడుతున్నాడు. అసలు వాడు నా మాట వినిపించుకోలేదు.

"ఈ ముగ్గురూ ఎవరు నాన్నా?" అన్నది రమణి రోదసీ యాత్రికులున్న ఫోటో చూపిస్తూ.

దాని జిజ్ఞాస చూస్తూ వుంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది. అన్నీ అడిగి తెలుసుకోవాలనే కోరికతో 'అదేమిటి, ఇదేమిటి నాన్నా' అంటూ అడుగుతూ వుంటుంది. దీనికున్న ఉత్సాహం వాడికి నాలుగోవంతైనా లేదు.

రమణి అడిగినదానికి జవాబు చెప్పి "ఏరా స్కూలు లేదా యివాళ" అన్నాను వాసుతో.

"ఉండు నాన్నా! నా కసలే లెక్క కుదరక చస్తుంటే నువ్వేమిటి మధ్య" అన్నాడు.

నాకు ఒళ్ళు మండింది. అసలే ఎండనపడి పనిచేసి వచ్చానేమో వాడలా అనేసరికి కోపం పట్టలేక "ఏరా స్కూలుకు వెళ్ళలేదా అంటే సమాధానం చెప్పవు..మంచి నీళ్ళు యివ్వమంటే కదలవు..పైగా వెధవ సిగరెట్ పెట్టెలు ముందేసుకు కూర్చుంటావ్ - చదువు సంధ్యా లేకుండా" అంటూ ఆ కోపంలో రెండు తగిలించాను.

వాడు గట్టిగా ఏడుపు మొదలు పెట్టాను.

జానకి అది విని ఎక్కడుందో పరుగెత్తుకుంటూ వచ్చి, "అయ్యో, మా నాయనే ఎంత

దెబ్బ తిన్నావురా..ఏడవకు బాబూ'' అంటూ వాడిని దగ్గరకు తీసుకున్నది.

"పసివెధవ అని అయినా చూడకుండా అలా కొట్టారు - వాడేం చేశాడని? అయినా మంచినీళ్ళు వాడిని అడక్కపోతే నన్ను పిలవకూడదూ. ఇవాళ నేనే వాడిని బడికి వెళ్ళవద్దన్నాను. పాపం రాత్రి నిద్ర ముంచుకువచ్చి యివాళ అప్పచెప్పవలసిన పద్యం చదవలేదు. 'ఎలాగే అమ్మా, మాష్టారు కోప్పడతారు' అని అంటే 'పోనీలే నాయనా, ఇవాళ బడికి వద్దులే...రాత్రికి చదువుకుందువు గాని' అన్నాను. మీరేమో పసివెధవ అని అయినా చూడకుండా.."

"వాడా పసివెధవా..వాడికి బుద్ధి వుండకపోతే నీకు వుండద్దూ. పోనీ బడి మానేసినవాడు బుద్ధిగా ఏమన్నా చదువుకుంటున్నాడా అంటే అదీ లేదు. కాళీ సిగరెట్టు పెట్టెలు ముందర వేసుకూర్చున్నాడు. వాడిని చెడగొడుతున్నది అసలు నువ్వే. వాడినని లాభం లేదు'' అన్నాడు కోపంతో.

★ ★ ★

వాసుకి తెల్లవారిన దగ్గర్నుంచి జ్వరం. మూసిన కన్ను తెరవటం లేదు.

జానకి "మీరే చేశారు. యిదంతా. మీ దెబ్బలకే వాడలా ఒళ్ళు తెలీకుండా పడివున్నాడు. ఇప్పుడు హాయిగా వుందా మీకు'' అంటూ ఏడవడం మొదలు పెట్టింది.

నేనేం మాట్లాడలేదు. వెళ్ళి డాక్టరును పిలుచుకు వచ్చాను.

"ఏముంది మామూలు జ్వరం'' అంటూ ఏదో మందు యిచ్చి వెళ్ళిపోయాడాయన.

నేను జానకి ఏడుపు చూడలేక వీధి వరండాలోకొచ్చి కూర్చున్నాను. నేనూ బాధపడ్డాను. నాకింతకు ముందెన్నడూ అంత కోపం రాలేదు. అసలు నేనెన్నడూ పిల్లల్ని కొట్టి ఎరగను. కానీ ఆ రోజెందుకో కోపాన్ని నిగ్రహించుకోలేకపోయాను. కారణం యిలా చెడిపోతున్న వీడి భవిష్యత్తు ఏమవుతుందా అని ఎక్కువగా ఆలోచించడమే కావచ్చు. వీడికి రేపేమయినా అయితే జానకి ముఖం చూడగలనా....

ఆ రాత్రి వాడు మగత నిద్రలో "కొట్టకు నాన్నా..నన్ను కొట్టకు'' అంటూ కలవరిస్తూ మాటి మాటికీ వులిక్కిపడుతూనే వున్నాడు. నిద్ర పోకుండా మంచం ప్రక్కనే కూర్చుని వాడికి సపర్యలు చేస్తూ ..మధ్య మధ్యలో నా మీద క్రోధాగ్ని జ్వాలలు కురిపించింది జానకి.

ఏమయితేనేం తెల్లవారేసరికి జ్వరం తగ్గింది. వాసు పలకరిస్తే మాట్లాడుతున్నాడు.

అప్పటినుంచీ పిల్లల్ని మళ్ళీ ఎప్పుడూ కొట్టలేదు.

కానీ జానకి గారాబంతో వాడు మరీ రాటుతేలిపోతున్నాడు. జానకి అంతగా వాడిని గారాబం చేయటానికి వేరే కారణం కూడా వుంది. రామనాధంగారి అబ్బాయి పోయాడన్న వార్త తీసుకువచ్చినది ఎవరో కాదు..మా పనిమనిషి రంగి.

ఆ రోజు మా యింటికి వస్తూనే అందుకున్నది:

"ఏంటోనమ్మా..పాపం. లేకలేక వ్రతాలు చేసి..వూళ్ళు తిరిగినాక పుట్టాడు ఒక్కగానొక్క మగబిడ్డ. బ్రతికి బట్టకడతాడనుకుంటే యింతలోనే ఆ భగవంతుడు చిన్నచూపు సూసిండు. పాపం నిన్న రేత్రి వరకు బాగానే వున్నాడంటమ్మా. ఇంతలోనే ముంచు కొచ్చింది. పాపాయమ్మగారి బాధ సూడలేకపోతున్నానండమ్మా''

"ఎవరే...ఏమిటి అంటున్నావ్?" అన్నది జానకి.

"అదేనండమ్మగోరు..ఆ సకలా అది ఈదిలో లేరండీ..పారవతమ్మగోరు, ఆరి బిడ్డడు యియాల పొద్దున్నే పోయాడండి. ఆడ్నుండే వస్తుండా. మొన్ననేనండి ఆకులో పలారం పెట్టి 'యియాల సిన్నయ్యగోరి పుట్టినరోజే రంగీ, తిను. నీ పిల్లలకీ తీసుకుపో' అంటూ గొడవ సేసారండి. పాప మాయమ్మ ఎప్పటికి కోలుకుంటాదో ఏమో... ఆ పిల్లాడికి అంత వయసొచ్చినా యావిడ ముద్దలు కలిపి అన్నం.." రంగి యింకా ఏమేమిటో చెబుతుంటే తనూ ఏదో అడుగుతున్నది జానకి.

నాకూ తెలుసు రామనాథంగారి అబ్బాయి సంగతి. వాళ్ళు అతి గారాబంగా పెంచారు అతన్ని. నేనొకసారి ఆయనతో "అంత గారాబం పనికిరాదండీ" అన్నాను.

ఆయన "ఏమిటోనండీ..ఒక్కగానొక్క కొడుకు. లేకలేక కలిగాడు. కూతురైనా, కొడుకైనా వాడే! వాడు కాస్త నొచ్చుకున్నాడంటే మేము చూడలేము...." అంటూ చెప్పుకొచ్చాడు.

'పాపం! ఈ దెబ్బకి వాళ్ళెలా తట్టుకుంటారో' అనుకున్నాను.

అప్పటి నుంచి వాసు మీద ఈగవాలనివ్వటంలేదు జానకి. ప్రతిదానికి జానకి వెనకేసుకు రావటంతో వాడికి ఒకప్పుడు, నా మీద వున్న గౌరవం, భయం, భక్తి బొత్తిగా పోయినాయ్. వాడు నా మాటే లక్ష్యపెట్టటం మానేశాడు.

"ఏమిటండీ, ప్రక్క మీద నించి లేవకుండానే కళ్ళు తెరుచుకుని మరీ ఆలోచిస్తున్నారు" అన్న జానకి మాటలతో ఆలోచనలలో నుంచి తేరుకుని ఈ లోకంలోకి వచ్చాను.

కాఫీ అందుకుంటూ, "వాసు ఏడి..కనపడలేదు" అన్నాను ఇందాక ప్రేమగా వాడిని ఎక్కడకు పంపించిందో తెలుసుకుందామని.

"అదేదో మంచి తెలుగు సినిమా వచ్చిందటండీ వెళ్ళాడు" అన్నది జానకి నెమ్మదిగా.

వాడు అడగగానే డబ్బులివ్వటం, సినిమాలకు పంపించటంతో వాడికి అలుసు ఎక్కువయింది. నా మాట అసలు లెఖ్ఖ చేయటం మానేశాడు. 'ఏరా పరీక్షలు దగ్గరకొస్తుంటే యింత ప్రొద్దుపోయేవరకూ ఎక్కడికెళ్ళావురా' అంటే 'అమ్మతో చెప్పే వెళ్ళాను నాన్నా' అంటాడు. ఇంకేం చెప్పాలి వాడికి?

"మొన్న ఏదో హిందీ సినిమా..నిన్న సర్కస్..మళ్లీ యివాళ ఏదో మంచి సినిమా ..బాగుంది. వాడు అడగటం. నువ్వు పంపటం..ఇలా అయితే వాడేమైనా బాగుపడతాడా వాడు చదువుకుని పైకి వస్తాడని నాకు మాత్రం నమ్మకం లేదు."

"ఏమిటండీ ఆ మాటలు. అసలు వాడు వెడతానని అనలేదండి. వాళ్ళ ఫ్రెండ్స్ అంతా తాజ్‌లో ఏదో మంచి పిక్చర్ వుందని వాడ్ని వస్తావా అని అడిగాడట. నిన్ననేకదా వెళ్ళింది నేను రానులే అన్నాడుట. వాడు నాతో ఆ మాటలు చెబుతే పోనీలే, పసివెధవ, స్నేహితులు వెడుతున్నారు ముచ్చటపడుతున్నటున్నాడని నేనే డబ్బులిచ్చి పంపించాను. మనకున్నది ఒక్క మెగ వెధవే గదండీ. పది మంది వున్నారా ఏమన్నానా? వాడి ముద్దూ ముచ్చటా తీర్చలేనంత దీనస్థితిలో వున్నామా మనం?"

"అబ్బ జానకీ! నీకెలా అర్థం అవుతుంది. నా వుద్దేశ్యం అది కాదు - ఆ మాత్రం అర్థం

చేసుకోవేం! అవునూ, వాడి రిజల్టు వచ్చేది యివాళే కదా'' నాకు తెలుసు వాడి రిజల్టు ఆ రోజే వస్తాయని.

"ఆహా తెలీదండి! అయినా మనవాడు పాసవకపోతే ఈ వూళ్ళో ఎవరండీ పాసయేది. ఆ..మరిచిపోయాను. వాసు రాత్రికి యింటికి రానని అన్నాడండీ. హాలు దూరంకదా. అక్కడే వాళ్ళ ఫ్రెండ్ యింట్లో పడుకుని రేపు ప్రొద్దున్నే వస్తానన్నాడండీ. చీకట్లో అంత రాత్రి రావటం కష్టం అని నేనూ సరే అన్నాను'' నెమ్మదిగా అన్నది.

"ఉహూ! అయితే వాడికి బాగా తెలుసన్నమాట యివాళ రిజల్టు వస్తున్నా యని...ఈసారయినా పాసవుతాడా! విచారించి ఏం లాభంలే..ప్రతిసారీ మామూలేగా! నేను అలా వెళ్ళొస్తాను. తలుపేసుకో!'' అంటూనే బయటకు నడిచాను.

నా అనుమానాలు నాకున్నాయి మరి.

నడుస్తూనే ఆలోచిస్తున్నాను.

అసలు మా వాసు ఎలా చదివి బాగుపడి పైకొస్తాడో నా కర్థం కావటం లేదు. వాడికసలు చదువు మీద కొంచెం శ్రద్ధ తక్కువ. దానికి తోడు మా ఆవిడ సపోర్టు వాడికి. వాడిని నేను కొంచెం కసిరితే పుస్తకం ముందు వేసుకు కూర్చుంటాడు. ఇంతలోనే వస్తుంది జానకి.

"ఏమిటండీ, యింత ప్రొద్దుపోయే వరకూ చిన్న వెధవ మేలుకొని వుంటే వాడి ఆరోగ్యం పాడవదూ! లేరా బాబూ పోయి పడుకో. మిగతాది రేపు చదువుదువుగానిలే'' అని వాడిని పక్కమీదకు చేరుస్తుంది.

పెళ్ళయిన క్రొత్తల్లో పిల్లల్నెలా పెంచాలి, ఏం జాగ్రత్తలు తీసుకోవాలి, గారాబం చేస్తే ఎలా పాడవుతారు అని చాలా కబుర్లు చెప్పేది. మరి యిప్పుడిలా ఎందుకు తయారయిందో...

ఎంత ఆలోచించినా కారణం ఒకటే కనబడుతున్నది.

ఒక్కగానొక్క కొడుకు. లేకలేక పుట్టాడు అంటూ గారాబం చేసి చివరకు వాడుట్టి పనికిరానివాడై ఎదురు తిరిగినప్పుడు.. ఇలా యెందుకు పెంచామా అని తమని తామే శపించుకునే తల్లిదండ్రులను మనం ఎంత మందిని చూడడంలేదు. ఒకరు కానీ, యిద్దరుకానీ, నలుగురుగాని అసలు పిల్లల్ని ఎలా పెంచాలో, తెలుసుకోవాలి. ఈనాడు మన చుట్టూ ఉన్న వాతావరణం - ముఖ్యంగా ప్రతీ పుస్తకాల షాపుల్లోను కనపడే సెక్స్, క్రైమ్ పుస్తకాలు, కుటుంబ చిత్రాలంటూ పబ్లిసిటీ చసుకునే చవకబారు సినిమాలలోని అర్ధనగ్న నృత్యాలూ, ఫైటింగ్‌లూ, తల్లిదండ్రులను ఎదిరించమని సందేశం చెప్పే హిప్పీ మూవ్‌మెంట్స్, అన్నిటికి మించి విదేశీ అనుకరణలతో ముందుకు వెడుతున్నారో, వెనక్కే నడుస్తున్నారో తెలుసుకోలేని స్థితిలో చేసే అర్థంలేని ఆర్భాటాలూ, పసిపిల్లలుగా ఉన్నప్పుడే వారి హృదయాల్లో ముద్రితమై వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దటం మాట అటుంచి వ్యక్తిగతంగా ఎంత అధోగతిలోకి తీసుకువెడతాయో వేరే చెప్పనవసరంలేదు. అసలు పిల్లలు చెడిపోవటానికయినా, బాగుపడటానికయినా పూర్తిగా బాధ్యులు తల్లిదండ్రులే....

మర్నాడు ప్రొద్దున్నే భోజనం చేసి ఆఫీసుకి బయల్దేరాను. మా ఆవిడ గుమ్మం వరకూ

వచ్చింది..ఏదో చెప్పాలని. నాకు తెలుసు జానకి ఏం చెప్పాలనుకుందో అసలు ప్రొద్దుటి నుంచీ తనలో తనే అనుకుంటున్నట్టుగా అన్నది 'వాసు యింకా రాలేదేమిటి?' అని. నేనేం మాట్లాడలేదు.

"ఏమండీ! వాసు యింకా రాలేదండీ, యింత ప్రొద్దుఎక్కినా" అన్నది జానకి కొంచెం భయపడుతూ.

"వాడే వస్తాడులే నెమ్మదిగా తిరిగి తిరిగి భోజనం వేళకి" అన్నాను ఆఫీసుకి బయల్దేరుతూ.

సాయంత్రం నేను యింటికి వచ్చేసరికి రమణి పరుగెత్తుకుంటూ వచ్చి. "అన్నయ్య యింకా రాలేదు నాన్నా.. అమ్మ ప్రొద్దుటి నుంచి అన్నం తినలేదు. ఏడుస్తున్నది...." అన్నది గుడ్లనీరు కక్కుకుంటూ.

నేను జానకి దగ్గరకు వెళ్ళి, "ఛీ, ఏమిటీ పిచ్చి జానకీ! లే, లేచి ముఖం కడుక్కో. ప్రొద్దుటి నుంచి అన్నం తిలేదుటగా లే ముందు" అంటూ లేపి కూర్చోపెట్టాను.

జానకి దుఖం ఆపుకోలేక నా గుండెల మీద తల ఆనించి ఏడుస్తూ 'ఏమండీ. వాసు ప్రొద్దున్న వస్తానన్నాడండీ. ఇంతసేపు ఎక్కడ వున్నాడో, ఏం చేస్తున్నాడో, ప్రొద్దుటి నుంచి అన్నం తిన్నాడో లేదో - వెళ్ళి కనుక్కురండి వాడి స్నేహితుల యిళ్ళన్నిటికి వెళ్ళి అడిగి రండి" అన్నది.

ఇంతలో వాకిట్లో 'వాసూ' అని ఎవరో పిలుస్తుంటే రమణి ఏదో చెబుతోంది. నేను చటుక్కున లేచి వీధిలోకి వచ్చాను. అతను అప్పుడే బయల్దేరబోతున్నాడు. అతన్ని పిలిచి"మా వాసు నిన్న నీకు కనిపించాడా అబ్బాయ్?" అని అడిగాను.

"రాత్రి సినిమాకి వెడదామనుకుంటుండగా, మా రిజల్టు వచ్చాయండీ. నేను పాసయ్యాను. కాని వాసు పరీక్ష పోయింది. అది చూసుకుని వాసు ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. అంతే! తర్వాత నాకే సంగతీ తెలీదు."అన్నాడతను.

ఆ మాటలు లవినగానే జానకి గుండెలు బాదుకుంది. పెద్దగా ఏడిచింది.

"పరీక్ష తప్పాడని ఏం అఘాయిత్యం చేశాడో పిచ్చి సన్నాసి..వెళ్ళి వెతకండి... వెళ్ళండి..."

నేనూ జానకినలా చూస్తూవుండలేకపోయాను. గబ గబా బయల్దేరాను. బయల్దేరబోయే ముందు జానకితో అన్నాను: "నువ్వూరికే గాబరాపడక.. నేను పోలీసులకు రిపోర్టిస్తాను. తెలిసిన అందరి దగ్గరా వాకబు చేస్తాను. నాలుగు మూలలా వెతుకుతాను సరేనా, నువ్వు మాత్రం భయపడకు"

నేను యింటికి వచ్చేసరికి యిల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఎలాగయినా వాసు వుంటే మంచి సందడి ఎప్పుడూ ఏదో మాట్లాడుతూ అందరినీ నవ్విస్తూ, రమణిని ఏడిపిస్తూ సరదాగా ఉంటాడు. వాడు లేని యిల్లు శలవు రోజు స్కూలులా ఉంటుంది.

జానకి పెరటి దొడ్లో గుమ్మం మీద కూర్చుని గడ్డం క్రింద చేయి పెట్టుకుని ఏదో ఆలోచిస్తూ ఉంది.

నన్ను చూసి లోపలికి పరుగెత్తుకుంటూ వచ్చింది. నా ముఖం చూడగానే ఆమెకి అంతా అర్థమయింది. మళ్ళీ ఒక్కసారిగా బావురుమన్నది.

మరునాడు దగ్గరలోవున్న చుట్టాలందరకూ ఫోను చేయించాను. కానీ ఫలితం శూన్యం.

ఇలా రెండు రోజులు గడిచాయి.

జానకి ఈ రెండు రోజులలోనే బాగా దెబ్బతిన్నది.మూడవ రోజున నేను యింటికి వచ్చేసరికి జానకి నన్ను చుట్టేసుకుని బావురుమన్నది. ఆమె చేతిలోని ఉత్తరాన్ని అందుకున్నాను. ఉత్తరం పూర్తిచేసి తల ఎత్తాను.

"హు! దీనికంతకూ కారణం నువ్వు జానకీ..వాడిని మొదటి నుంచీ జాగ్రత్తగా గారాబం చేయకుండా పెంచివున్నట్లయితే వాడూ బాగా చదువుకుని వృద్ధిలోకి వచ్చేవాడు. కానీ యిప్పుడు చూడు, పరీక్ష తప్పాడు. ఇంక చదువు తనకి అంటదనుకున్నాడు. నాకు ముఖం చూపించడానికి భయపడ్డాడు. ఇంట్లోంచి పారిపోయాడు. తన గురించి వెతకవద్దని, తను మళ్ళీ రాననీ ఉత్తరం రాశాడు. ఇదంతా ఎవరి వల్ల అంటావ్?"

జానకి మళ్ళీ బావురుమంది.

"వాడు లేకపోతే నేను బ్రతకలేనండీ. మీరు వెంటనే వెళ్ళి వాడిని తీసుకురండి. ఇకనుంచీ జాగ్రత్తగా చూసుకుంటాను. మీరు చెప్పినట్టే చేస్తాను..." ఇంకా యింకా అంటూ తన తప్పును తెలుసుకోవటమేకాక, పశ్చాత్తాపపడుతున్నది జానకి.

జానకిని చూస్తే గుండె తరుక్కుపోయింది.

ఆమె తల ఎత్తింది.

"పిల్లలు మల్లె తీగ వంటివారు. తోటమాలి చక్కటి పందిరి వేస్తే చక్కగా అల్లుకుని కంటికి అందంగా కనబడుతుంది మల్లె తీగ. పట్టించుకోకుండా అలాగే వదిలేస్తే నేల మీదే ప్రాకుతుంది. పైకి రాలేదు.అంతేకాదు, ప్రక్కనున్న ముళ్ళ కంచెల మీదకు ప్రాకుతుంది. మట్టి కుప్పల మీదకు ప్రాకుతుంది. పిల్లలూ అంతే జానకీ..వాళ్ళని సరి అయిన దారిలో పెట్టవలసింది మనమే..." నెమ్మదిగా అన్నాను.

జానకి మళ్ళీ ఘొల్లుమంది.

ఆమెను బాధించటం అన్యాయమనిపించింది.

"వాసూ" నెమ్మదిగా పిలిచాను. వాసు పరుగెత్తుకుంటు వచ్చి వాళ్ళమ్మ వడిలో - వాలాడు.

జానకి వాడిని చూసి, "బాబూ వాసూ..యింకెప్పుడూ నన్ను వదిలి వెళ్ళవుగా బాబూ!' అంటూ ముద్దుల వర్షం కురిపించింది.

వాడు నా వంక చూసి ముసి ముసి నవ్వులు నవ్వాడు.

నేను మాట్లాడవద్దని సైగచేసి యివతలకు వచ్చేశాను.

"అమ్మా! నాన్నే నన్ను ఈ మూడు రోజులూ రామనాథంగారింట్లో ఉండమని చెప్పారే. రిజల్టు వచ్చిన రోజు బజార్లో కనిపించి నన్ను తీసుకెళ్ళి వాళ్ళ యింట్లో వుంచారు. ఆ వుత్తరం అలా రాయించింది కూడా నాన్నేనే..." అంటున్న మాటలు లోపల నుంచి వినిపిస్తున్నాయి.